# కవితా కౌముది

## కవి — ముకుంద రామారావు

కవితగా వెలుగు చూపించడానికి
మొలకెత్తిన విత్తనం కవి

లేత నీలి రంగు
సీతాకోకచిలుక లాంటి ప్రపంచాన్ని
తనదైన పదజాలం వలలో
పట్టుకొని చూపిస్తాడు

గాలి నీరు
వెలుగు నీడలు
అనాది వారసత్వం

చలికాలం మంచు
ఎండాకాలం వేడి
వర్షాకాలం చినుకుల్లా
తరతరాల కవిత్వం

ఒకే దృశ్యాన్ని
ఎవరెలా చూసినా
అతను చూసే చూపు వేరు
అందరికీ అదే చూపించాలని ఆరాటం

సమస్యల సముద్రాలు
ఎడబాటు మంటలు
మనస్సును కెలికేవేవీ
అతనిని తాకకుండా ఉండవు

అందులోనే అతను
అడవిలోని నీడల్లా కోల్పోతూ ఉంటాడు

★★★



## అత్తిపత్తి
## లక్ష్మీ కందిమళ్ళ

ముడుచుకుపోయి
ఎండిపోయి
అత్తిపత్తిలా
ఆ చినిగిన రాత్రిలో
చీకట్లో ఎక్కడో
నిన్ను తెంపబడి

నీలో నువ్వు
గొణుక్కుంటూ
పీలికలు పీలికలై
నుసిలా రాలుతూ

ఇంకా
ఎన్నో అమాయకపు
ఇష్టాలను కౌగిలించుకొని
మరి ఇష్టాలకు
మరణం వుంటుందని తెలీక నువ్వు
ఆ చీకట్లో
ఒక కథ
నిన్ను దూరంగా విసిరేస్తూ

అలా
నువ్వు
రాత్రి మబ్బులా..

★★★

## విరుపు
## అనూరాధ బండి

ఇంతకుమించి నవ్వలేనప్పుడు మిన్నకుండి
ఆకాశాన్ని చూస్తాను.
చుక్కలవేటలో రాత్రినిపొడిచేదెవరో..
చీకటికి మసిగా నవ్వడం నేర్పిందీ?..

కనుమరుగైన ఎవరో జ్ఞాపకంలా కంటిని దాటుతారా!?

ఈ మొక్కలకి గాలిపట్టింది
పిచ్చిగా ఊగుతూ...
అరరే ఇన్నేసి పువ్వులూ ఆకుల లెక్కా?.

మొన్న ఎగురవేసిన గాలిపటం బానే ఉంది.
తెంపుకుపోయిందెవరో ఎలా తెలుసేదీ?
అయినా ఇప్పుడు ఎవరూ ఈ సందిగ్ధంలో మిగిలిలేరు.
అప్పటి కాగితపు పడవల్లో వాళ్ళు
ఒట్టిగా తేలిపోయారు.
నేను నా అనుకుంటూ నాకు నేనే ఊ అంటున్నానా!

పరమబద్ధకంలో నిదుర.
నిలువదూ..
కలువదూ..

మరెప్పుడైనా కలలరెప్పలకి కాటుకపుయ్యాలి.
అందంగా ప్రపంచంలో చూపై తేలుతాయ్.

★★★

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

మన నడుమ దివ్యులెందరో మనుచునుండ్రు
తెలియనేరము వారల దివ్యులంచు
దేవతల నడుమ మనము తిరిగినపుడు
దివ్యులైనను మనల గుర్తించరేమొ

దేవతలు మార్పు వాంఛించి దివిని వదలి
వచ్చి వసియింతురేమొ యీ వసుధ యందు
మనుజులిక చాలు భువియంచు తనువు వీడి
తరలిపోయెదరో దివ్యధామమునకు

ఇలను తిరుగాడుచుండు దివ్యులకు వారి
యూర్ధ్వలోకపుటునికి గుర్తుండదేమొ
ఇలను వీడి మనము దివికేగినపుడు
గతము సుంతయు కన్నుల గట్టదేమొ

కలల కథలెట్లు మదినుండి తొలగిపోవు
గతపు మనుగడలా రీతి కరగిపోవు
మరపు మనసునకద్భుత వరమె యగునొ
జ్ఞానశకలమ్ము హరియించు శాపమగునొ

నిదురలోనికి జారుకొనిన క్షణాన
తెలివి యన్నది సర్వమదృశ్యమౌను
వేరు లోకము చేరిన వారికెల్ల
పూర్వజీవితము సుషుప్తి పోల్కి యగును

COMMENTS